క్లుప్తంగా

విజ్ఞానదాయకంగా వేసవి శిక్షణ శిబిరం



తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం పఠనాసక్తిని పెంచేందుకు 'నచ్చిన పుస్తకం చదువు' కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా.. గ్రంథాలయంలోని నచ్చిన పుస్తకం ఎంచుకుని, విద్యార్థులతో చదివించారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇంకొల్లు రంగారావు సైన్స్ తరగతి నిర్వహించారు. సంగీతం మాస్టారు కాటూరి నాగేశ్వరరావు ఇంద్రజాలం ప్రదర్శించారు. ఇంద్రజాలం వెనుక సైన్స్ సూత్రాలు ఉన్నాయని చెప్పారు. మంత్రాలు, మ్యాజిక్‌లు ఏవీ లేవని జనవిజ్ఞాన వేదిక కార్యకర్తలు తెలియజేశారు. వీరితో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ హుస్సేన్ ఉన్నారు. గ్రేడ్-1 లైబ్రేరియన్ కె.రమాదేవి పర్యవేక్షించారు.

13 మంది జూదరుల అరెస్ట్ – రూ.2.80లక్షలు స్వాధీనం



తెనాలిరూరల్: తెనాలి కొత్తపేటలో పేకాట స్థావరంపై ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తెనాలి కార్యాలయంలో అధికారులు వివరాలు వెల్లడించారు. స్థానిక అమరావతి లాడ్జిలో జరిపిన దాడుల్లో 13 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 2,83,580లు స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంథొని రాజ్, డీఎస్‌ఈఓ బృందం ఇన్‌స్పెక్టర్ టి.పెదనారాయణ స్వామి, ఎస్‌ఐ అరిఫ్, తెనాలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



తెనాలి: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి బస్ షెల్టర్‌లో నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో మంగళవారం రెడ్‌క్రాస్ తెనాలి శాఖ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, రెడ్‌క్రాస్ కోశాధికారి నాళం శ్రీమన్నారాయణమూర్తి, బంగారు శ్రీనివాస్, బంగారు పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ఐలవరంలో ఉచిత వైద్య శిబిరం



ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో మంగళవారం సేవా భారతి ఆధ్వర్యంలో అశ్విని సంచార వైద్యశాల, మండవ ఫౌండేషన్, ఎస్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసులు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గడ్డం రామకోటేశ్వరరావు, సాయి, గ్రామస్తులు జంజనం హేమశంకరరావు, వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



కర్లపాలెం: వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపీనాథ్ పేర్కొన్నారు. నాగరాజుపాలెంలో మంగళవారం 104 వాహన సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 58మందికి డాక్టర్ గోపీనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఎండలు అధికంగా ఉన్నప్పుడు ప్రయాణం చేయవద్దని సూచించారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశంలో ఉంచి, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ ఇవ్వాలని సూచించారు. అవసరం మేరకు డాక్టర్ వద్దకు తీసుకెళ్లి.. వైద్యం చేయించాలని చెప్పారు. మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుని, సక్రమంగా మందులు వాడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్‌ఎం శివనాగమణి, ఎంపీహెచ్‌ఏ జాషువా, నాగరాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలు.. జనం బేజారు..!

దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇల్లు కనిపిస్తే.. రాత్రికి రాత్రే గుల్ల చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగానే..వారికి మెళకువ వచ్చే లోగా బీరువాలు, అలమారాల్లోని బంగారు ఆభరణాలు, నగదును సర్దేస్తున్నారు. పట్టణంలోని బాలాజీ రావుపేటలోని ఓ ఇంట్లో చోరీ జరిగి.. రోజులు గడవక ముందే అక్కడే మరో ఇంట్లో.. గంటల వ్యవధిలో అంగలకుదురులో ఇంకో ఇంట్లో.. నెల వ్యవధిలో మూడు ఇళ్లల్లో చోరీలు జరగడంతో పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తే.. ఎక్కడ లూటీ జరుగుతుందోనని భయపడుతున్నారు. పోలీసు సిబ్బందికి బందోబస్తు డ్యూటీలు ఎక్కువ కావడంతో.. పట్టణంలో గస్తీ కరువైందని విమర్శలు వినిపిస్తున్నాయి. నిఘా కొరవడటంతో.. దొంగలు మరింత రెచ్చిపోతున్నారు.

- ఇదే నెలలో మూడు చోరీలు
- అంగలకుదురులో బంగారు ఆభరణాల అపహరణ
- బాలాజీరావుపేటలో రెండు ఇళ్లల్లో సేమ్ సీన్ రిపీట్..
- నిద్రిస్తుండగానే.. నిశ్శబ్దంగా ఊడ్చేస్తున్నారు..
- పోలీసులకు సవాలుగా మారిన చోరీలు



అంగలకుదురులో దొంగతనం జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం



దొంగలు పడిన ఇంట్లో తెరచివున్న ఇనప్పెట్టె, బీరువా

తెనాలి: తెనాలి రూరల్ మండలం అంగలకుదురులో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి అలపాటి సాంబశివరావు ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లో ఉన్న ఇనప్పెట్టె, బీరువాలోని 315 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. గత రాత్రి సాంబశివరావు సొంత పనిమీద విశాఖపట్నం వెళ్లగా.. ఆయన భార్య, తల్లి, కుమార్తె, అల్లుడు నలుగురూ.. రెండు గదుల్లో నిద్రిస్తుండగా.. మిగిలిన గదిలో దొంగలు తమ పని కానిచ్చేశారు. కిటికీ గ్రిల్ తొలగించి, ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు చోరీకి పాల్పడినట్టు చెబుతున్నారు.

24గంటల ముందు..

ఈ చోరీకి 24 గంటల ముందు అంటే 28న రాత్రి బాలాజీరావుపేటలో ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. గడ్డిపాటి అంజయ్య సత్రం పక్కవీధిలో ఓ ఇంటి పైభాగంలో అద్దెకుంటున్న కోర్టు ఉద్యోగి పాలమూరి కృష్ణకిషోర్ ఇంటిని లూటీ చేశారు. గుంటూరులోని జిల్లా కోర్టులో పనిచేస్తున్న కృష్ణకిషోర్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం సాయంత్రం గుంటూరు వెళ్లారు. సోమవారం ఉదయం వీరి ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని కింద పోర్షనులో ఉంటున్న యజమాని గమనించారు. ఫోను ద్వారా సమాచారం ఇచ్చారు. కృష్ణకిశోర్ వచ్చి చూడగా, తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోని సామగ్రి చెల్లాచెదరుగా పడి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. త్రీటౌన్ ఎస్‌ఐ విజయకుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. తులపుకు గొళ్లెం చాకచక్యంగా తొలగించి, బీరువాలోని 20 సవర్ల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి, రూ.70 వేల నగదు సహా మొత్తం రూ.2.70లక్షల విలువైన సొత్తు చోరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు.

పక్షం రోజుల ముందు..

ఇదే పోలీస్‌స్టేషను పరిధిలోని బాలాజీరావుపేటలోనే ఈ నెల 9న తొలిసారిగా చోరీ జరిగింది. మహేంద్రనగర్ కాలనీలో ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కొలసాని భూపతినాయుడు ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువాల్లోని విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన భూపతినాయుడు, హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు గృహ ప్రవేశానికి ఈ నెల 2న కుటుంబ సభ్యులంతో కలిసి వెళ్లారు. 10న ఉదయం, ఇక్కడి ఇంటికి వచ్చిన పనిమనిషి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. వెంటనే ఫోన్ చేసి భూపతి నాయుడుకు సమాచారం ఇవ్వటంతో, వారంతా హడావుడిగా బయలుదేరి తెనాలి చేరుకున్నారు. బీరువాలు తెరిచి ఉండి, సామానంతా చెల్లా చెదురుగా ఉండటాన్ని గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కింద పోర్షనులో నివసిస్తున్న భూపతి నాయుడు తల్లి ఇంట్లోనూ చోరీ జరిగిందని గుర్తించారు. తొలుత 350 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగాయని భావించినా, కొన్ని ఆభరణాలు వేరేచోట భద్రంగా ఉండటంతో ఊపిరిపీల్చుకున్నారు. త్రీటౌన్ సీఐ యు.శ్రీనివాసులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్‌లు బాధితులనుంచి వివరాలు సేకరించారు. దర్యాప్తు చేస్తున్నారు.

ఈ విధంగా వరుస చోరీలతో.. దొంగలు అటు పోలీసులకు, ఇటు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పట్టణంలో రాత్రిళ్లు పోలీసు గస్తీ తగ్గిపోయిన విషయం తెలిసిందే. ఉన్న సిబ్బందికి బందోబస్తు డ్యూటీలు ఎక్కువ కావటంతో రాత్రి గస్తీకి కొరత ఏర్పడింది. ఇంటికి తాళం వేసి వేరే ప్రాంతాలకు వెళ్లే స్థానికులు సమీప పోలీస్‌స్టేషనుకు సమాచారం ఇస్తే, రాత్రిళ్లు నిఘా ఉంటుందని పోలీసులు పదే పదే సూచిస్తున్నా, చాలామంది పట్టించుకోవటం లేదు. తీరా చోరీ జరిగి, సొత్తును కోల్పోయాక ఆవేదన పడుతున్నారు. పోలీసు నిఘా కొరవడటం, ప్రజల అజాగ్రత్త దొంగలకు వరంగా మారింది. ఇప్పటికైనా పోలీసులు రాత్రి గస్తీ పెంచాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రజలు కూడా ఊరు విడిచి వెళ్లేటపుడు ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాల లబ్ధి



కేక్‌ను కట్‌చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

- నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలన వేడుకలు
- కేక్ కట్ చేసి, జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



దివ్యాంగులకు ట్రై స్కూటర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పేదరికమే ప్రామాణికంగా ఎలాంటి వివక్ష, అవినీతి లేకుండా పేదలకు పారదర్శకంగా సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించిన పాలకులు లేరని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్మెల్యే శివకుమార్ పార్టీ జెండా ఆవిష్కరించారు. భారీ కేక్ కట్ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా ముగ్గురు దివ్యాంగులకు ట్రై స్కూటర్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి పారదర్శకంగా అమలు చేసినట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అగ్రకులాల్లోని పేదలకు నాలుగేళ్లలో రూ.2.25 లక్షల కోట్ల సంక్షేమ లబ్ధిని నేరుగా వారి ఖాతాల్లో జమచేసినట్టు వివరించారు. సీఎం వైఎస్ జగన్ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి కిందస్థాయి ప్రజాప్రతినిధుల వరకు ప్రతి ఒక్కరూ పేదల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఆరిగ చంద్రారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, ఆవుల కోటయ్య, షేక్ ఇస్మాయిల్, దాసరి వీర వసంతరావు, యాతాటి అనిల్, కుర్రా సుజాత, వీర్లపాటి విజయలక్ష్మి, పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, బూరెల దుర్గా, కొమ్ము రాయల్, గుర్రం హేమలత, బొల్లిముంత పోతురాజు, డి.మల్లికార్జునరెడ్డి, చుండూరు సాయి, మల్లెబోయిన రాము, టిక్స్ బాల, రావి రాంబాబు, ఆక్కిదాసు కిరణ్, చింకా సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఖలేదా నసీమ్

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు సారథులు వార్డు వలంటీర్లేనని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అన్నారు. పట్టణంలో 21వ వార్డులోని 25వ సచివాలయంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలరు, మున్సిపల్ చైర్ పర్సన్ ఖలేదా నసీమ్ హాజరయ్యారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఠంచనుగా ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో క్రియాశీలక పాత్ర వహిస్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. రానున్న కాలంలో వలంటీర్లు మరింత నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. వార్డులో ఒకరికి సేవా రత్న పురస్కారం లభించగా, 19 మందికి సేవా మిత్ర పురస్కారాలు లభించాయి. వీరందరికీ ఖలేదా నసీమ్ సత్కరించి, అవార్డులను అందజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3లో భాగంగా భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని విఠలేశ్వరనగర్ రామ మందిరం వద్ద మంగళవారం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పారా మెడికల్ అఫ్తాలమిక్ అసిస్టెంట్ (పీఎంవోఏ) పెనుమాల అరుణరాణి పరీక్షలు చేశారు. 60 మందిని పరీక్షించగా 22 మందికి కళ్ల జోళ్లు అవసరం కాగా, ముగ్గురిని రిఫరల్‌కు పంపడం జరిగిందని చెప్పారు.

కార్యక్రమంలో సీహెచ్‌వో డి.మాతయ్య, ఎంపీహెచ్‌ఏ అనగాని తిరుమలరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు నందం లీలాకుమారి, గాడల్లి నిర్మలాకుమారి, ఆదిన వరలక్ష్మి, మద్దుల లక్ష్మి, అంక సరస్వతీ, శ్రీరాముల వెంకట రమణ, పి.కలిమిలారాణి పాల్గొని వైద్య సేవలు అందించారు.

బరువులెత్తే క్రీడలో మరో పేదింటి కుసుమం

- తెలంగాణలో జరిగిన జాతీయ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో 'రజతం' సాధించిన వక్కలగడ్డ రేవతి
- రూ.50 వేల ఆర్థికసాయం అందజేసిన తెనాలిలోని శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్



రేవతికి చెక్కును అందజేస్తున్న లక్ష్మణ్‌బాబు

తెనాలి: బరువులెత్తే క్రీడలో పేదింటి యువతులు సత్తా చాటుతున్నారు.పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాల్ని సాధిస్తున్నారు. ఆ కోవలో ఇప్పుడు మరో ఆణిముత్యం వెలుగులోకి వచ్చింది. ఆమె వక్కలగడ్డ రేవతి. తెలంగాణ రాష్ట్రంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగిన 2వ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకంతో విజయహాసం చేసింది. మహిళల 76 కిలోల విభాగంలో 82 కిలోల బరువులనెత్తి రజత పతకం సాధించటం విశేషం. డిగ్రీ సెకండియర్ చదువుతున్న రేవతి, రూరల్ మండలం కఠెవరంలో మాజీ వెయిట్ లిఫ్టర్ల ఆధ్వర్యంలో నడుస్తున్న కోచింగ్ సెంటరులో సాధన చేస్తోంది. నందివెలుగులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయినిగా చేస్తున్న కొల్లిపర నాగశిరీష శిష్యరికంలో సాధన కొనసాగిస్తున్న రేవతి తండ్రి స్థానిక వైకుంఠపురం దేవస్థానంలో చిరుద్యోగి. తండ్రి ప్రోత్సాహంతో అటు చదువుకుంటూనే బరువులెత్తే క్రీడకు అంకితమైంది. ఆ క్రమంలోనే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఏకంగా జాతీయ పోటీల్లో రజతంతో మెరిసింది. ఆమె పడుతున్న కష్టం, వెయిట్‌లిఫ్టింగ్ ప్రదర్శిస్తున్న ప్రతిభకు తన వంతు ప్రోత్సాహంగా, స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ సాయినగర్‌లో గల శ్రీషిర్డి సాయిబాబా దేవాలయానికి చెందిన శ్రీషిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కె.లక్ష్మణ్‌బాబు మంగళవారం సాయి సన్నిధిలో రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాల్ని సాధించి, క్రీడా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో తెనాలికి గల ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. తనకు ఆర్థికంగా సహకరిస్తున్న లక్ష్మణ్‌బాబు సహకారంతో అంతర్జాతీయ స్థాయి విజయాల్ని సాధించగలనన్న విశ్వాసంతో ఉన్నట్టు రేవతి చెప్పారు. కార్యక్రమంలో కోచ్ కొల్లిపర నాగశిరీష, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ నాగం జ్ఞానదివ్య, మూకిరి సుజాత, జంధ్యాల రాజేశ్వరరావు, చింతలపాటి సీతారామశాస్త్రి, పాలేరు భార్గవరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆశీర్వదిస్తున్న మహిళ

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ పాలనపై అన్ని వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను ప్రజలందరూ స్వాగతిస్తున్నారని చెప్పారు. అంగలకుదురు గ్రామంలో మంగళవారం ఐదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి.. సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకున్నారు. మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు గడప గడపకు కార్యక్రమం వారధిలా ఉందన్నారు. అంగలకుదురు గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నట్టు చెప్పారు. 30 ఏళ్లుగా ఆదరణకు నోచుకోని ప్రధాన సెంటరు నుంచి రైల్వే గేటు వరకు సిమెంట్ రోడ్డు నిర్మించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు చెప్పారు. 264 మందికి కాపు నేస్తం, 254 మందికి ఈబీసీ నేస్తం కింద లబ్ధి చేకూరుతోందని వివరించారు. 14, 15 ఆర్థిక సంఘ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నింటిని నాలుగు నెలల్లో పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ నేతలు జగన్‌మోహనరావు, తిన్నలూరి శ్రీనివాసరావు, కఠారి హరీష్, బూరెల దుర్గ, చుండూరు గోపి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

రేపల్లె: బాలల మేధా శక్తిని పెంపొందించేందుకే సమ్మర్ క్యాంప్ నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక సభ్యుడు కె.సాయిప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 23వ వార్డు బాల్ బహుదూర్ ప్రాథమిక పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక, బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ స్పెషల్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్యాంపులో 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ కృషి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ వాసిరెడ్డి పద్మ

పిట్టలవానిపాలెం: మహిళా సాధికారతకు కృషి చేసిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆమె మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. మహిళా సాధికారతను చేతల్లో చేసి చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. ఇంటి నివేశన స్థల పట్టాతో పాటు అనేక ప్రభుత్వ పథకాలను మహిళలకే అందేలా చేశారని చెప్పారు. ప్రస్తుతం మహిళలు చాలా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

దాడి ఘటనలో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: దాడి ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు వివరాలిలా మేరకు.. తెనాలి మండలం అంగలకుదరు గ్రామానికి చెందిన జి.రవి అనే వ్యక్తి.. అదే గ్రామానికి చెందిన సాలవ సురేంద్ర వద్ద గతంలో కొంత మొత్తం అప్పుగా తీసుకున్నాడు. బాకీ విషయమై రవితో ఘర్షణ పడిన సురేంద్ర అతనిపై తన స్నేహితులు ప్రభు, ప్రవీణ్‌లతో కలసి ఇటీవల దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తెనాలి జిల్లా వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడా దాడి చేస్తూ వీడియో తీశారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పరస్పర కేసులు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనలో ఇరువర్గాలపై పరస్పర కేసులు నమోదయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఓ వైద్యుడికి, అతని భార్యకు కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. ఈ విషయమై వైద్యుడు, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు విజయవాడ నుంచి ఇద్దరు న్యాయవాదులు మంగళవారం తెనాలి వచ్చారు. వైద్యుని సోదరుడితో మాట్లాడే క్రమంలో ఘర్షణ జరగడంతో పరస్పర దాడికి పాల్పడ్డారు. రెండు వర్గాల ఫిర్యాదుల మేరకు.. కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



రేపల్లె: సమస్యల పరిష్కారానికి నిరంతరం సీఐటీయూ ఉద్యమాలు చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ పేర్కొన్నారు. సీఐటీయూ 53వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 1970 మే 30న కలకత్తాలో సీఐటీయూ ఆవిర్భవించిందని తెలిపారు. నాటి నుంచి కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు.